## ఐపీఎల్‌కు మించిన టోర్నీ లేదు.. పాకిస్థాన్ జర్నలిస్ట్‌కు ఇంగ్లాండ్ క్రికెటర్ దిమ్మ తిరిగే కౌంటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ క్రికెట్ లో ఐపీఎల్ కు మించిన టీ20 టోర్నీ లేదనేది వాస్తవం. సగటు క్రికెట్ అభిమానిని ఎవరిని అడిగినా ఈ విషయం చెబుతారు. ప్రపంచ క్రికెటర్లందరూ ఈ టోర్నీ ఆడడానికి ఆసక్తి చూపిస్తారు. ఈ మెగా టోర్నీలో సత్తా చాటి అంతర్జాతీయ క్రికెట్ కు ఎంపికైన చాలా మందే ఉన్నారు. రెండు నెలల పాటు అభిమానులకి ఫుల్ కిక్ ఇచ్చే ఐపీఎల్ ప్రపంచంలోనే నెంబర్ వన్ టీ20 టోర్నీ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఒకరకంగా చెప్పాలంటే ఐసీసీ నిర్వహించే టీ20 వరల్డ్ కప్ కంటే ఐపీఎల్ కే ఎక్కువ ఆదరణ ఉంటుంది. అయితే పాకిస్థాన్ క్రికెట్ తో పాటు అక్కడ ఫ్యాన్స్ తమ దేశంలో జరిగే పాకిస్థాన్ సూపర్ లీగ్ ఐపీఎల్ కు ఏ మాత్రం తీసిపోదని వితండ వాదన చేస్తారు. ప్రస్తుతం ఐపీఎల్ తో సమాంతరంగా పాకిస్థాన్ సూపర్ లీగ్ జరుగుతుంది. శుక్రవారం (ఏప్రిల్ 11) ప్రారంభయిన ఈ లీగ్ విజయవంతంగా ముందుకు వెళ్తుంది. ఇదిలా ఉంటే.. ప్రెస్ కాన్ఫరెన్స్ లో భాగంగా.. లాహోర్ ఖలందర్స్ ప్లేయర్ సామ్ బిల్లింగ్స్ ను ఇండియన్ ప్రీమియర్ లీగ్‌ని పోల్చమని ఒక పాకిస్తానీ జర్నలిస్ట్ అడిగాడు. దీనికి స్పందించిన బిల్లింగ్స్.. ఐపీఎల్ ను హైలెట్ చేసి మాట్లాడి అతనికి దిమ్మ తిరిగే షాక్ ఇచ్చాడు.


బిల్లింగ్స్ మాట్లాడుతూ.. " ప్రపంచవ్యాప్తంగా అత్యంత హైప్ ఉన్న టీ20 లీగ్‌లో పాకిస్థాన్ సూపర్ లీగ్ ఒకటి. కానీ ఐపీఎల్ ఆదరణ, గ్లామర్ తో పోలిస్తే ఏ టీ20 టోర్నీ కూడా సరిపోదు. కేవలం పిఎస్ఎల్ మాత్రమే కాదు ప్రపంచంలో ఏ టీ20 టోర్నమెంట్ కూడా ఐపీఎల్ దరిదాపుల్లోకి కూడా చేరలేదు. మీరు నా నుంచి ఏదో వివాదాస్పద సమాధానం చెప్పించాలనుకుంటున్నారు. ప్రపంచంలో ఐపీఎల్ ను మిగతా లీగ్ అను చూడడం చాలా కష్టం. పూర్తిగా క్లారిటీతో చెబుతున్నాను. పాకిస్థాన్ సూపర్ లీగ్ లాగా.. ఇంగ్లాండ్ లో మేము.. అదేవిధంగా ఆస్ట్రేలియాలో బిగ్ బాష్ లీగ్ ఐపీఎల్ తర్వాత రెండో బెస్ట్ లీగ్ అనిపించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి". అని ఈ ఇంగ్లాండ్ క్రికెటర్ తెలిపాడు.

## ఆడలేకపోయానని ఒప్పుకుంటున్నా.. అతడికి ఛాన్స్ ఇవ్వాలనే తప్పుకున్నా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాపై జరిగిన 2024-25 బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మకు పీడకలనే మిగిల్చింది. కెప్టెన్ గా, బ్యాటర్ గా హిట్ మ్యాన్ ఘోరంగా విఫలమయ్యాడు. తన స్థానం మార్చుకొని ఆరో స్థానంలో బ్యాటింగ్ చేసిన హిట్ మ్యాన్ తీవ్రంగా నిరాశపరిచాడు. మొదటి టెస్టుకు దూరమైన రోహిత్.. ఆ తర్వాత జరిగిన మూడు టెస్టుల్లో 5 ఇన్నింగ్స్ ల్లో కేవలం 31 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఒక కెప్టెన్ గా రోహిత్ శర్మకు ఇదే అత్యంత చెత్త సిరీస్. రెండు, మూడు, నాలుగు టెస్టులాడిన రోహిత్ చివరి టెస్టుకు సంచలన నిర్ణయం తీసుకున్నాడు. బోర్డర్ గవాస్కర్ లో భాగంగా సిడ్నీ వేదికగా జరిగిన ఐదవ టెస్ట్ మ్యాచ్ నుండి తప్పుకోవడం ద్వారా వార్తల్లో నిలిచాడు. వ్యక్తిగత కారణాల వల్ల మొదటి టెస్ట్ మ్యాచ్‌కు దూరమైన రోహిత్, ఐదు ఇన్నింగ్స్‌లలో కేవలం 31 పరుగులు మాత్రమే చేయగలిగిన తర్వాత ఐదవ టెస్ట్ నుండి తప్పుకున్నాడు. ఫేలవ ఫామ్‌తో ఇబ్బంది పడిన టీమిండియా కెప్టెన్ తనకు తానుగా జట్టు నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్టు బుధవారం (ఏప్రిల్ 16) తెలిపాడు. ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో తాను పరుగులు చేయలేకపోయానని రోహిత్ అంగీకరించాడు రోహిత్ శర్మ మాట్లాడుతూ.. " బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో నేను బంతిని సరిగా కొట్టలేకపోయాను. ఈ విషయాన్ని నేను నిజాయితీగా ఒప్పుకోవాలి. నేను ఫామ్ లో లేనని తెలిసి తుది జట్టు నుంచి తప్పుకోవాలని భావించా. మేము గిల్ ఆడాలని భావించాం. అంతకముందు జరిగిన మెల్బోర్న్ టెస్ట్ లో గిల్ ఆడలేకపోయాడు. కోచ్, సెలెక్టర్‌తో మాట్లాడి ఈ విషయం చెబితే చాలా వాదన జరిగింది. జట్టు కోసం నేను తీసుకున్న ఈ నిర్ణయం సరైనదే అని నేను భావిస్తున్నాను". అని రోహిత్ బియాండ్23 క్రికెట్ పాడ్‌కాస్ట్‌లో అన్నారు. జనవరి 3 నుంచి ప్రారంభమైన ఈ టెస్టులో రోహిత్ శర్మ స్థానంలో యువ బ్యాటర్ శుభమాన్ గిల్ ప్లేయింగ్ 11 లో చోటు దక్కించుకున్నాడు. హిట్ మ్యాన్ స్థానంలో వచ్చిన గిల్ కూడా విఫలమయ్యాడు. రెండు ఇన్నింగ్స్‌లలో గిల్ 33 పరుగులు మాత్రమే చేశాడు. ఈ సిరీస్ మొత్తం గిల్ ఐదు ఇన్నింగ్స్‌లలో 93 పరుగులు చేసి ఘోరంగా విఫలమయ్యాడు. ఈ టెస్ట్ మ్యాచ్ లో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ప్రస్తుతం రోహిత్ శర్మ ఐపీఎల్ లో ముంబై ఇండియన్స్ తరపున ఆడుతూ బిజీగా ఉన్నాడు. ముంబై తమ తదుపరి మ్యాచ్ గురువారం (ఏప్రిల్ 17) సన్ రైజర్స్ తో మ్యాచ్ ఆడబోతుంది.

## ఐపీఎల్ నుంచి సన్ రైజర్స్ స్టార్ స్పిన్నర్ ఔట్.. SRH జట్టులో కర్ణాటక పవర్ హిట్టర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025 లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు బిగ్ షాక్ తగిలింది. ఆస్ట్రేలియా స్టార్ స్పిన్నర్ ఆడమ్ జంపా భుజం గాయం కారణంగా ఐపీఎల్ 2025 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. జట్టులో అసలే స్పిన్నర్లతో ఇబ్బందిపడుతున్న హైదరాబాద్ జట్టుకు ఇది బిగ్ షాకింగ్ అనే చెప్పాలి. ఐపీఎల్ ప్రారంభంలో జంపా రెండు మ్యాచ్ ల మాత్రమే ఆడాడు. రెండు వికెట్లు పడగొట్టి 11.50 ఎకానమీతో బౌలింగ్ చేశాడు. జంపా స్థానంలో సన్ రైజర్స్ రీప్లేస్ మెంట్ ప్రకటించింది. ఈ ఆసీస్ స్పిన్నర్ స్థానంలో కర్ణాటక బ్యాటర్ స్మరన్ రవిచంద్రన్‌ను తీసుకున్నారు. 21 స్మరన్ రవిచంద్రన్ ను రూ. 30 లక్షల కనీస ధరకు జట్టులో తీసుకున్నారు. దేశవాళీ క్రికెట్ లో కర్ణాటక తరపున నిలకడగా రాణించే వారిలో స్మరన్ ఒకడు. ఇటీవలి రంజీ ట్రోఫీ సీజన్‌లో అతను 64.50 సగటుతో 516 పరుగులు సాధించాడు. లిస్ట్ ఎ క్రికెట్‌లో 10 మ్యాచ్‌ల్లో 72.16 సగటుతో 433 పరుగులు చేయడం విశేషం. ఆరు టీ20 మ్యాచ్‌ల్లో 34.00 సగటుతో 170 పరుగులు చేశాడు. అతని స్ట్రైక్ రేట్ 170.00 ఉండడం విశేషం. సన్ రైజర్స్ మిడిల్ ఆర్డర్ లో ఈ కర్ణాటక బ్యాటర్ ఆడే అవకాశముంది. ప్రస్తుతం సన్ రైజర్స్ ఐపీఎల్ లో ఆశించిన ప్రదర్శన చేయలేకపోతుంది. ఇప్పటివరకు ఆడిన ఆరు మ్యాచ్ ల్లో రెండు మ్యాచ్ ల్లో గెలిచి నాలుగు ఓడిపోయింది. తొలి మ్యాచ్ లో రాజస్థాన్ పై గెల్చి శుభారంభం చేసిన హైదరాబాద్ ఆ తర్వాత వరుసగా నాలుగు మ్యాచ్ ల్లో ఓడిపోయింది. అయితే పంజాబ్ తో కీలకమైన మ్యాచ్ లో 246 పరుగుల లక్ష్యాన్ని ఛేజ్ చేసి పరాజయాలకు బ్రేక్ వేసింది. సన్ రైజర్స్ తమ తదుపరి మ్యాచ్ గురువారం (ఏప్రిల్ 17) ముంబై ఇండియన్స్ తో తలపడుతుంది. ముంబైలో వాంఖడే వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుంది.

## పిక్‌టాక్ : స్టైలిష్ లుక్‌లో అందాల శృతి

కమల్ హాసన్ నట వారసురాలు శృతి హాసన్ ఇండస్ట్రీలో ఇప్పటికే తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. కమల్ కూతురు అనే బ్రాండ్ ఇమేజ్ ఆమెకు మొదటి నుంచి లేదు. సొంత ఇమేజ్‌తోనే, సొంత ప్రతిభతోనే నటిగా రాణిస్తూ, ఆఫర్లు దక్కించుకుంటూ వచ్చింది. మొదటి సినిమా హిందీలో చేయడంతో పాటు, మొదటి సినిమాలోనే బికినీ ధరించడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. స్టార్ కిడ్స్ అంటే ఎంట్రీ మరోలా ఉంటుంది. కానీ శృతి హాసన్ అందరిలా కాదు. ఆమె ప్రత్యేకంగా సినిమాలు చేసింది, ప్రత్యేక పాత్రలు, ప్రత్యేక పాటల్లోనూ నటించడం ద్వారా పాన్ ఇండియా స్టార్ హీరోయిన్స్ జాబితాలో చోటు దక్కించుకుంది. హిందీ సినిమా ఇండస్ట్రీలో నటిగా ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత తెలుగు, తమిళ్ భాషల్లో నటించింది. తెలుగులో ఈమె నటించిన గబ్బర్ సింగ్ సూపర్ హిట్ అయింది. పవన్ తో చేసిన ఆ సినిమా శృతి హాసన్‌కు మొదటి సూపర్ హిట్ అనే విషయం తెల్సిందే. ఆ సినిమా తర్వాత బలుపు, ఎవడు, రేసు గుర్రం, శ్రీమంతుడు, క్రాక్ ఇలా చాలా సినిమాల్లో నటించింది. హీరోయిన్‌గా ఈమె నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద కొన్ని సూపర్ హిట్‌గా నిలవగా, కొన్ని నిరాశ పరిచాయి. అయినా ఈమె కెరీర్‌లో వరుస ఆఫర్లు దక్కించుకుంది. ఐటెం సాంగ్స్‌కి సైతం భారీ పారితోషికం దక్కించుకున్న అరుదైన ఘనత ఈమెకు దక్కింది అనడంలో సందేహం లేదు. సోషల్ మీడియాలో ఈమె రెగ్యులర్‌గా అందమైన ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్ లో ఏకంగా 24 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న శృతి హాసన్ తాజాగా మరోసారి స్టైలిష్ అవతార్ లో ఫోటోలను షేర్ చేసింది. ఇతర హీరోయిన్స్‌కి చాలా భిన్నంగా ఈమె ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ ఉంటుంది. అందమైన ఫోటోలు, వీడియోలను ఈమె షేర్ చేయడం కాకుండా విభిన్నంగా ఉన్న ఔట్ ఫిట్‌లను ఈమె ధరించి వైరల్ అవుతూ ఉంటుంది. ఇలాంటి ఔట్ ఫిట్స్ కేవలం శృతి హాసన్‌కే సాధ్యం అంటూ చాలా మంది సెలబ్రెటీలు ముఖ్యంగా హీరోయిన్స్ అనుకుంటారు అంటే శృతి ఏ రేంజ్ స్టైలిష్ ఔట్ ఫిట్‌ను ధరిస్తుందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా విభిన్నమైన యాష్ కలర్ ఔట్ ఫిట్‌ను ధరించి, లూజ్ హెయిర్‌తో మెడలో యాష్ కలర్ పులి గోరును ధరించి ఉన్న శృతి హాసన్ స్టైల్ ఐకాన్‌గా కనిపిస్తుంది. సాధారణంగా హీరోయిన్స్ ఇలాంటి ఔట్ ఫిట్స్‌కి ప్రిపర్ చేయరు. కానీ ఈమె మాత్రం చాలా ధైర్యంగా ఇలాంటి ఫోటోలను సోషల్ మీడియా ద్వారా షేర్ చేస్తూ ఉంటుంది అంటూ నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈమెకు ఉన్న ఫాలోయింగ్ ఇలాంటి ఫోటోలతో మరింతగా పెరగడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈమధ్య కాలంలో తెలుగుతో పాటు, హిందీ, ఇతర భాషల్లోనూ కొత్త ప్రాజెక్ట్‌లకు కమిట్ అయింది.





సమంత ఇన్‌స్పైరింగ్ ఇన్‌స్టాగ్రామ్ కోట్‌లు మరియు పూజ్యమైన స్నాప్‌లు



సాంప్రదాయ ఎరుపు మరియు క్రీమ్ దుస్తులలో అషు రెడ్డి మెరుస్తున్నాడు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com